క్లుప్తంగా

నేడు పాలపొంగలి మహోత్సవం

కపిలేశ్వరపురం: అంగరలోని **శ్రీమధ్యాహ్నపు** అమ్మవారు, బుల్లి బాపనమ్మ **అమ్మవార్లకు శుక్ర**వారం పాలపొంగలి ఉత్సవం **నిర్వహించను**న్నట్టు ఆయా ఆలయాల నిర్వాహక **కమిటీ** నాయకులు గురువారం తెలిపారు. **గ్రామ సౌభా**గ్యాన్ని కాంక్షిస్తూ దీర్ఘకాలంగా **పాలపొంగలి** ఉత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. **ఆలయ** ఆవరణలో వండిన పాలపొం**గలిని అంగర,** పడమర ఖండ్రిక గ్రామాల భక్తు**లకు ప్రసాదం**గా అందజేయడం ఆచారంగా వ**స్తుందన్నారు.**

21 నుంచి విజయదుర్గ జాతర


అంగరలోని విజయ దుర్గ అమ్మవారు

కపిలేశ్వరపురం: ఈ నెల 21వ తేదీ నుంచి అంగరలోని శ్రీవిజయదుర్గ అమ్మవారి జాతర ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆలయ ఆవరణలో పందిరి రాట ముహూర్త పూజలు చేశారు. ఆలయ అర్చకులు కొలువుల మల్లికార్జునరావు మాట్లాడుతూ ఈ నెల 21న ఆలయం వద్ద జాతర, 22న తీర్థం, 23న నైవేద్య సమర్పణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

ముగిసిన పోలేరమ్మ తీర్థం


నల్లూరులో పోలేరమ్మ అమ్మవారు

కపిలేశ్వరపురం: నల్లూరులోని శ్రీపోలేరమ్మ జాతర ఉత్సవం గురువారంతో ముగిసింది. ఈనెల 11న జాతర, 12న తీర్థం నిర్వహించగా గురువారం ఉత్సవం ముగింపు పూజలు చేశారు. అమ్మవారి ఉత్సవ గరగ గ్రామ వీధుల్లో ఊరేగించారు. నల్లూరు, కాలేరు, అంగర, వెదురుమూడి, పడమర ఖండ్రిక, టేకి గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. నల్లూరు గ్రామ ఆడపడుచులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా పుష్పయాగం


ప్రత్యేకాలంకరణలో వేణుగోపాలస్వామివారు

రాయవరం: సోమేశ్వరంలో ఉన్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో గురువారం రాత్రి పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి, అమ్మవారికి ఆలయ అర్చకులు పెద్దింటి శేషాచార్యులు అర్చకత్వంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. వివిధ రకాల పుష్పాలతో నయనానందకరంగా అలంకరించి, పండ్లు, స్వీట్లతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పుష్పయాగంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో గంధం సత్యనారాయణ, ఆలయ సిబ్బంది పెమ్మాడ వెంకటేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

టెన్నికాయిట్ క్రీడాకారులకు సత్కారం


క్రీడాకారులను సత్కరిస్తున్న స్పోర్ట్స్ అథారిటీ ప్రతినిధులు

మండపేట: టెన్నికాయిట్ ద్వారా అంతర్జాతీయ గుర్తింపు పొందిన మండపేట విద్యార్థులు వద్దాది వినయ్‌కుమార్, పిల్లి రామారావులను ఏపీ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ రవి నాయుడు చేతుల మీదుగా సత్కారం అందుకున్నారు. గురువారం ఆ విద్యార్థులు విజయవాడలోని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ రవినాయుడు, టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు వైడీ రామారావు, ప్రధాన కార్యదర్శి కేవీవీ సత్యనారాయణలను కలిశారు. ఈ సందర్భంగా క్రీడాకారులిద్దరినీ శాలువాతో సత్కరించి అభినందించారు. క్రీడల్లో రాణించడానికి ప్రోత్సాహకాలను పెంచుతున్నట్టు చెప్పారని తెలిపారు. రాబోయే రోజుల్లో టెన్నికాయిట్ ఆడేవారికి వసతులు మెరుగుపరుస్తామని చెప్పారన్నారు. విద్యార్థులు మన్ననలు పొందడంపై కోచ్ కుంచే రమేష్ ఆనందం వ్యక్తం చేశారు.

సలాది అప్పారావుకు పలువురి పరామర్శ

కపిలేశ్వరపురం: సతీ వియోగంతో బాధపడుతున్న కోరుమిల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ డీసీసీబీ డైరెక్టర్ సలాది అప్పారావును గురువారం పలువురు పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఎంపీటీసీ సభ్యులు మేడిశెట్టి దుర్గారావు, శీలం భాస్కరరావు, ఉప సర్పంచ్ బొక్కా రాంబాబు, నాయకులు పసలపూడి శ్రీనివాస్, పిప్పర సంపతరావు, అంసూరి జయపాల్‌కృష్ణ, పాలింగి శ్రీనివాస్, తుపాకుల ప్రసన్నకుమార్, వంగా నల్లశ్రీను, ప్రగడ అర్జునరావు, జేసీబీ వెంకటేశ్వరరావు పరామర్శించారు.

భైరవం.. భీకరం


కె.గంగవరంలో రోడ్డుపై గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు

- శునకాల స్వైర విహారం
- మనుషులపై దాడి
- పెరుగుతున్న కేసులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

కె.గంగవరం: పట్టణ, పల్లెల్లో శునకాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. గుంపులుగా తిరుగుతూ మనుషులపై దాడికి దిగుతున్నాయి. వాహనదారులను వెంటపడి తరుముతున్నాయి. జనాన్ని భయపెడుతున్నాయి. దీంతో చిన్నా పెద్దా అంతా వీధుల్లోకి వచ్చేందుకు వెనుకాడుతున్నారు. కుక్కల సంతతిని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు.

పట్టణంలోని మున్సిపాలిటీతో పాటు గ్రామ పంచాయతీల వరకు నిధులు ఉన్నా శునకాల నియంత్రణ కాగితాలకే పరిమితమైంది. రామచంద్రపురం పట్టణంతో పాటు కె.గంగవరం, కాజులూరు, రామచంద్రపురం రూరల్, మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లోని గ్రామాల్లో కుక్కల స్వైర విహారం చేస్తున్నాయి. వాహన చోదకులు కుక్కల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో తీవ్రంగా **గాయపడి ఆసుపత్రిపాలవుతున్నారు. ఇంత జరుగుతున్నా శునకాల నియంత్రణ శస్త్రచికిత్సలు చేయించడంపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. కె.గంగవరం మండలంలో 2000, కాజులూరు మండలంలో 2300, రామచంద్రపురం రూరల్ 1800, మండపేట నియోజకవర్గంలో సుమారుగా 6740 వరకు కుక్కలు ఉన్నట్లు అంచనా. గ్రామాల్లోని మాంసం విక్రయ కేంద్రాల వద్ద** వ్యర్థ పదార్థాలు తింటూ మనుషులు, పశువులపై దాడులు చేస్తున్నాయని స్థానికులు అంటున్నారు.

నిత్యం 20కి పైగా కేసులు

రోజురోజు కుక్క కాటు కేసుల సంఖ్య పెరుగుతోంది. రామచంద్రపురం నియోజకవర్గంలోని పట్టణంతోపాటు మూడు మండలాల్లో, మండపేట నియోజవర్గంలోని మూడు మండలాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రతి రోజు 20 నుంచి 30 కేసులు వస్తున్నాయని ఆయా పీహెచ్‌సీల వైద్యులు చెబుతున్నారు కుక్క కరిచిన వారికి టీటీ ఇంజక్షన్‌తో పాటు యాంటీ రేబిస్ వ్యాక్సిన్(ఏఆర్‌వీ) నాలుగు డోస్‌లను 28 రోజుల వ్యవధిలో వేస్తున్నారు. కుక్కగాటు తీవ్రత ఎక్కువగా ఉన్న వారికి ఇమ్యునోగ్లోబులిన్స్ అనే ఇంజక్షన్‌ను కూడా అదనంగా చేస్తున్నారు. తల **భాగానికి దగ్గరగా** కుక్కకాటు పడిన వారికి **అపాయం ఎక్కువ**గా ఉంటుందని, కుక్కకాటు బాధితుల మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతుందని వైద్యులు చెబుతున్నారు.

ప్రథమ చికిత్స ఇలా

కుక్కగాటుకు గురైతే గాయాన్ని సబ్బుతో, నీటితో బాగా కడగాలి. గాయాల్ని కప్పకూడదు, దగ్గర్లోని డాక్టర్‌ని సంప్రదించాలి. ర్యాబిస్ వ్యాధితో చనిపోయిన జంతువులను కాల్చడం లేదా సున్నపు గుంటలో పూడ్చడం చేయాలి. కుక్క ఉండే పరిసరాలు, అవి తిరిగే ప్రదేశాలు, పాత్రలను క్రిమిసంహారక మందులతో తరచూ శుభ్రపరుచుకోవాలి. ఈ వ్యాధికి చికిత్స లేదు. పెంపుడు కుక్కలను పశువైద్యుడిని ర్యాబిస్ టీకా వేయించాలి. ఊరకుక్కలకు కూడా ఈ వ్యాధి రాకుండా పంచాయతీల సహాయంతో టీకాలు వేయించాలి.

ర్యాబిస్ కుక్కల లక్షణాలివీ

ర్యాబిస్ లక్షణాలున్న కుక్కల నోటి నుంచి చొంగ కారుతుంది. నాలుక బయటపెట్టి మతిలేకుండా తిరుగుతాయి. కనిపించిన వారిని, పశువులను, ఇతర కుక్కలను కరుస్తాయి. అరుపులో మార్పు వస్తుంది. ఇవి 7 నుంచి 10 రోజుల్లో చనిపోతాయి. ఈ జబ్బు వచ్చిన మరికొన్ని కుక్కలు తినకపోవడం, నిశ్చలంగా ఒకచోటే పడుకుని అలాగే ఉండిపోతాయి, పక్షవాతం రావడం తదితర లక్షణాలతో రెండు మూడు రోజుల్లో చనిపోతాయి. దీన్ని మూగ రేబిస్ అంటారు. ర్యాబిస్ కుక్క కరిస్తే వ్యాధి నిరోధక టీకాలు వేయించడం తప్పనిసరి.

ప్రత్యేక నిధులు లేవు



కుక్కలను పట్టించేందుకు పంచాయతీలకు ప్రత్యేక నిధులు లేవు. వాటిని సంహరించే అధికారం లేదు. కుక్కలు ఎక్కువగా మాంసం విక్రయ కేంద్రాల వద్దే సంచరిస్తున్నాయి. మాసం వ్యర్థాలను ఊరికి దూరంగా పాడేయాలని వారికి సూచించాం. వీధి కుక్కలకు కుటుంబ నియంత్ర శస్త్ర చికిత్సలో కోసం పశువైద్యులను సంప్రదించాం. త్వరంలో గ్రామ సర్పంచుల సహకారంతో వాటిని చికిత్స చేయిస్తాం.

– ఎస్. శ్రీనివాసరావు, ఎంపీడీఓ కె.గంగవరం

దినదిన గండం



కుక్కలు వీధుల్లో గుంపులుగా తిరుగుతూ అందరినీ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఎప్పుడు ఏవైపు నుంచి వచ్చి ఎవరి మీద దాడి పడతాయోనని భయపడుతున్నాం. ఇదివరకే ఎంతో మందిపై దాడి చేసి గాయపరిచాయి. దినదిన గండంగా మారింది. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందించడం లేదు.

– రాయుడు జగన్, నల్లచెరువు పుంత

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

జిల్లా ఎస్పీ కృష్ణారావు వెల్లడి


మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు

మండపేట: అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని శాంతి భద్రతలు పరిరక్షణే ధ్యేయంగా పోలీసుశాఖ పనిచేస్తుందని జిల్లా ఎస్పీ కృష్ణారావు వెల్లడించారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్ల వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం ఆయన పట్టణంలోని రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. సిబ్బంది పనితీరు, ప్రజలకు అందించే సేవలను ఆయన రూరల్ సీఐ పీ దొరరాజును అడిగారు. పెండింగ్ కేసులపై ఆరా తీశారు. సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల పరిస్థితిపై అడిగారు. రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేసినట్టు దొరరాజు తెలిపారు. అనంతరం ఎస్పీ కృష్ణారావు మీడియాతో మాట్లాడారు. గంజాయిని అరికట్టేందుకు, అక్రమ మద్యం రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు స్పెషల్ స్క్వాడ్ పనిచేస్తుందన్నారు. సంఘ విద్రోహ శక్తులు, నేరాలను అదుపు చేయడానికి సీసీ కెయేరాలు ప్రధాన కూడళ్లల్లో పనిచేస్తున్నాయన్నారు. మండపేటలో ట్రాఫిక్ ఇబ్బందులను అధిగమించేందుకు ప్రధాన కూడళ్లల్లో సిగ్నల్స్ ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నామన్నారు. సమావేశంలో రామచంద్రపురం డీఎస్పీ బీ రఘువీర్, రూరల్, రాయవరం, అంగర ఎస్సైలు పి.బుజ్జిబాబు, డి.సురేష్‌కుమార్, రవికుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ఎస్‌కేల్లో రైతు గుర్తింపు కార్డుల నమోదు

కపిలేశ్వరపురం: రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ గురువారం తెలిపారు. ప్రతి ఆర్ఎస్‌కే కేంద్రాల్లోనూ వ్యవసాయ సహాయకులు ఇందు కోసం అందుబాటులో ఉన్నారన్నారు. భవిష్యత్‌లో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాల్లో లబ్ధి పొందేందుకు రైతు విశిష్ట గుర్తింపు కార్డు ఉపకరిస్తుందన్నారు. 11 అంకెలతో కూడిన గుర్తింపు కార్డు తో వ్యవసాయ సేవలు సులభతరం కానున్నాయన్నారు. దీని కోసం భూమిగల రైతు ఆధార్ నంబర్, ఆధార్ కార్డుకి అనుసంధానం అయిన ఫోన్ నంబర్, భూమి తాలూకు రికార్డుల వివరాలను తెలపాలన్నారు. పట్టాదారు పాస్ పుస్తకం, మీ భూమి పోర్టల్ నుంచి పొందిన 1బీ ఫారం, రీసర్వేలో కేటాయించబడిన ఎల్‌పీఎం సంఖ్యలలో ఏదో ఒకటి తీసుకుని రైతు సేవా కేంద్రానికి వెళ్లాలని ఏఓ రమేష్‌కుమార్ తెలిపారు.

కోలంకలో వరుస చోరీలు


చోరీలపై కోలంకలో స్థానికులను విచారిస్తున్న కాకినాడ రూరల్ సీఐ కృష్ణచైతన్య

కాజులూరు: కోలంకలో ఇటీవల వరుస చోరీలు చోటుచేసుకోవటంతో స్థానిక ప్రజలు బెంబేలెత్తుతున్నారు. స్థానికులు, గొల్లపాలెం పోలీసులు తెలిసిన వివరాల ప్రకారం.. గత 15 రోజుల క్రితం దుండగులు సాయిబాబా మందిరంలో హుండీ పగులగొట్టి అందులోని నగదు చోరీ చేసారు. 10 రోజుల క్రితం ఒక ప్రైవేటు వైద్యుడి ఇంట్లో కొంత నగదు, ఇన్వేటరు, బ్యాటరీ దొంగతనానికి గురయ్యింది. ఆపై ఒక వృద్ధురాలి మెడలో నలుగు కాసులు బంగారం గొలుసు దొంగిలించిన చోరులు నాలుగు రోజుల క్రితం కిరాణా వ్యాపారం నిర్వహిస్తున్న మహిళ మెడలో మూడు కాసుల బంగారం గొలుసు లాక్కుని పోయారు. ఈ వరస చోరీలపై స్థానికుల ఫిర్యాదుల మేరకూ పోలీసులు విచారణ చేపట్టారు. గురువారం కాకినాడ రూరల్ సీఐ కృష్ణ చైతన్య సంఘటన స్థలాలను పరిశీలించి బాధితుల నుంచి దొంగతనాలు జరిగిన తీరును తెలుసుకున్నారు. దొంగలను పట్టుకునేందుకు తగిన చర్యలు తీసుకుంటామని వ్యాపారులు తమ వంతు బాధ్యతగా ప్రతీ షాపు వద్ద సీసీ కమేరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. గ్రామంలో కొత్తగా ఎవ్వరు వచ్చి, అనుమానాస్పదంగా కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

పేరాబత్తులకు మద్దతుగా ప్రచారం

కాజులూరు: ఉమ్మడి తూర్పు–పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా బీజేపీ నేతలు గురువారం మండల గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జీ దూడల శంకరనారాయణమూర్తి ఆధ్వర్యంలో పార్టీ నేషనల్ కౌన్సిల్ సభ్యుడు రొక్కాల సత్తిబాబు, పార్టీ జిల్లా కార్యదర్శి తలాటం అమ్మాజీ, జగన్నాథగిరి ఎంపీటీసీ కొప్పన లక్ష్మీ తదితరులు గ్రామాల్లో పర్యటించి ఉపాధ్యాయులను, పట్టభద్రులను కలుసుకుని కూటమి బలపరచిన ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు ఒకటో ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జనుపల్లి శ్రీనివాసు, పంతగడ జానకి రామయ్య, పానుగుమాటి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

తేజస్వరూప్‌కు అభినందన


తేజస్వరూప్‌ను అభినందిస్తున్న పీడీ జంపన రఘురామ్ తదితర అధ్యాపకులు

రామచంద్రపురం: పిఠాపురం హైస్కూల్ గ్రౌండ్‌లో ఈనెల 8వ తేదీ నుంచి 11 వరకు జరిగిన అండర్–16 రాష్ట్రస్థాయి యూత్ బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలురు జట్టు రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. ఈ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జాతీయ జూనియర్ కళాశాల ఇంటర్ ప్రథమ సంవత్సరం కంప్యూటర్ సైన్స్ విద్యార్థి వి.తేజస్వరూప్ ప్రతిభ కనబరిచి జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించినట్టు పీడీ జంపన రఘురామ్ స్థానిక విలేకరులకు తెలిపారు. కళాశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఏ అరుణోదయ కుమార్ గ్రంథాలయాధికారి ఎస్.చక్రధర రావు సీనియర్ అధ్యాపకులు ఏ వీరన్న వైవీవీ ప్రసాద్ ఏ అనుపమ తదితరులు అభినందించారు.

వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌ను కలిసిన నేతలు


జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన రవికుమార్, అయ్యప్ప


జగన్‌కు మర్యాద పూర్వకంగా కలిసిన మండపేట యువనేతలు

మండపేట: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మండపేట నియోజకవర్గ యువజన విభాగం మాజీ అధ్యక్షుడు చిర్ల జయరామ్‌రెడ్డి, అర్తమూరు సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, విజయభాస్కరరెడ్డి దంపతుల కుమారుడు గొలుగూరి సందీప్‌రెడ్డి గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. యువనేతలిద్దరూ తాడేపల్లిలోని ఆయన నివాసానికి చేరుకుని జగన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జగన్ నియోజకవర్గ ప్రజల కోసం, పార్టీ పరిస్థితులు అడిగి తెలుసుకున్నట్టు జయరామ్ తెలిపారు. కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి నియోజకవర్గంలో వైఎస్సార్ పూర్వవైభవానికి కృషి చేయాలని సూచినట్టు తెలిపారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు వెంట నడిచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారని తెలిపారు. కార్యకర్తలు ఎవరూ అధైర్యపడొద్దని ఏ కష్టం వచ్చినా అండగా ఉంటారని కార్యకర్తలకు భరోసా ఇచ్చి పార్టీని ముందుకు నడిపించాలని అన్నారన్నారు. జగన్‌ను కలిసిన వారిలో పార్టీ సీనియర్ నాయకుడు కర్రి వీర్రెడ్డి వున్నారు.

కృతజ్ఞతలు తెలుపుతూ...

వైఎస్సార్ సీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డిని మున్సిపల్ వైఎస్సార్ కౌన్సిలర్ మందపల్లి రవి కుమార్, 18వ వార్డు కౌన్సిలర్ నాయుడు లక్ష్మీ సౌజన్య భర్త యర్రగుంట అయ్యప్పలు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి ఆశీస్సులు అందుకున్నారు. ఇటీవల పార్టీ అనుబంధ విభాగాల ఏర్పాటులో సహచట్టం అధ్యక్ష బాధ్యతలు అప్పగించినందుకుగాను జగన్‌కు రవి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో రాష్ట్ర ఐటీ కార్యదర్శి వుంగరాల సంతోష్, కార్యకర్త నాగరాజు ఉన్నారు.

కార్పొరేట్‌కు మేలు చేసేలా కేంద్ర బడ్జెట్


ద్రాక్షారామలో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

రామచంద్రపురం రూరల్: వికసిత్ భారత్–2047 అంటూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025–26 బడ్జెట్ కేవలం కార్పొరేట్ శక్తులకు మాత్రమే మేలు చేసేలా ఉందని, సామాన్య ప్రజలు, రైతు కూలీలను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ప్రజా సంఘాల నాయకులు ధ్వజమెత్తారు. మండలంలోని ద్రాక్షారామ యానం సెంటర్ వద్ద భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు వెంటపల్లి భీమశంకరం, బి.సిద్ధూలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందన్నారు. విభజన హామీలను తుంగలో తొక్కి రాష్ట్రానికి మొండి చేయి చూపించిందన్నారు. విశాఖ రైల్వే జోన్, ఎస్ఐటీ, ఐఐటీ, ఐఐఎం, ట్రిపుల్ ఐటీ, ఐఐఎస్ఈఆర్, గిరిజన యూనివర్శిటీ, సెంట్రల్ యూనివర్శిటీ, దుగ్గరాజుపట్నం పోర్టు, కడప స్టీల్ ప్లాంట్, వైజాగ్ స్టీల్ ప్లాంట్, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, రాజధాని నిర్మాణానికి నిధుల ప్రస్తావన, కేటాయింపులు లేకుండా ఆంధ్రప్రదేశ్‌కు ఉత్త చేతులు అందించారన్నారు. దేశంలో నూటికి 70 శాతం ప్రజలు వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తుంటే కేవలం 2.51 శాతం కేటాయించి చేతులు దులుపుకోవడం, ఎరువుల సబ్సిడీలో రూ.3,412 కోట్లకు కోత విధించడం తదితర అంశాలతో పాటు పోలవరం, బీమా రంగంలో నూరు శాతం ఎఫ్‌డీఐలకు అనుమతి తదితర అంశాలను చూస్తే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ పేదల వ్యతిరేక బడ్జెట్‌గా ప్రతి ఒక్కరూ తీవ్రంగా వ్యతిరేకించాలని పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు చింతా రాజారెడ్డి, అంబటి కృష్ణ, వి. రామకృష్ణ, గుబ్బల శ్రీను, పట్టాభి, వాసంశెట్టి మహాలక్ష్మి, దుర్గ ఆటో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కువైట్‌లో చిక్కుకున్న మండపేట మహిళ


అమ్ములు

మండపేట: చేసిన అప్పులు తీర్చడం కోసం, పొట్టకూటి కోసం కువైట్ వెళ్లిన ఓ మహిళ అక్కడ చిక్కుకుపోయి పడరాని పాట్లు పడుతోంది. తనను వేధిస్తున్నారని, కడుపుకు కూడు కూడా పెట్టడం లేదని, గదిలో నిర్బంధించి చాలా బాధలు పెడుతున్నారంటూ ఆ మహిళ కుటుంబ సభ్యులకు పంపిన వీడియో సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతుండడంతో హాట్‌టాపిక్‌గా మారింది. బాధితురాలు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన పందిరి అమ్ములు ఆర్నెళ్ల క్రితం కువైట్ వెళ్లారు. తన భర్త చనిపోవడంతో ఆయన చేసిన అప్పులు పిల్లలకు భారం కాకూడదనే ఉద్దేశంతో తన ముగ్గురు కుమారులకు చెప్పాపెట్టకుండా కువైట్ పనికి వెళ్లారు. ఓ మహిళా ఏజెంట్ ప్రోత్సాహంతో వెళ్లిన ఆమెకు అక్కడ లేనిపోని చిక్కులు ఎదురయ్యాయి. తీరా వెళ్లాక కువైట్లో ఇంటి పనికి చేరిన అమ్ములు వారం రోజులు ఉంచుకుని నీవు వృద్ధురాలివి సరిగా పనిచేయడం లేదంటూ నెల రోజులకే బయటకు పంపించేశారు. ఇదే విధంగా మరో చోట పనికి వెళ్లినప్పటికీ అదే అనుభవం ఆమెకు ఎదురైంది. పని చేసిన జీతం ఏజెంట్ తీసుకుందని, అలాగే రెండు నెలల జీతం కూడా ఇవ్వలేదని వాపోయింది. తాను ఇంటికి వెళ్లి పోతానంటే పంపించకుండా గదిలో నిర్బంధించారని తెలిపింది. తాను వెళ్లాలంటే మరో రెండు లక్షలు ఖర్చు అవుతుందని మహిళా ఏజెంట్ చెబుతున్నారని, సరిగా ఆహారం పెట్టడం లేదని, పైగా తనను కొడుతున్నారని బోరున విలపిస్తూ కుటుంబ సభ్యులకు వాట్సాప్ ద్వారా వీడియో పంపింది. పిఠాపురం నియోజకవర్గం ఉప్పాడలో ఉంటున్న చిన్న కుమారుడు దుర్గాప్రసాద్ అతడి భార్య సోషల్ మీడియాలో పోస్టు పెట్టడంతో వైరల్ అయింది. గతంలో తాను ఆపరేషన్ చేయించుకున్నానని, తన ఆరోగ్యం క్షీణించిందని ఎలాగైనా తనను మా పిల్లల దగ్గరకు చేర్చండంటూ బాధితురాలు లోకేష్, చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్‌లకు చేతులు ఎత్తి మొక్కింది. కుటుంబ సభ్యులు తన తల్లిని ఇంటి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

నేషనల్ బాల్ బ్యాడ్మింటన్ రిఫరీగా వెంకట్రావు


ప్రిన్సిపాల్ చేతుల మీదుగా నిమామకపత్రం అందుకుంటున్న వెంకట్రావు

మండపేట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వారా వెంకట్రావును బాల్ బ్యాడ్మింటన్ ఆఫ్ ఇండియా రిఫరీ బోర్డు మెంబర్‌గా ఎంపిక చేసినట్టు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ టీకేవీ శ్రీనివాస రావు తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటనలో గురువారం వివరాలు వెల్లడించారు. వెంకట్రావు కర్ణాటకలో జరిగిన 70వ నేషనల్ సీనియర్ మెన్, వుమెన్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు నేషనల్ రిఫరీగా వ్యవహరించారన్నారు. బాల్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పంపిన నియామక పత్రాన్ని ప్రిన్సిపాల్ ఆయనకు అందజేశారు. వారా మాట్లాడుతూ తమ కాలేజీలో బాల్ బ్యాడ్మింటన్ పట్ల ఆసక్తి ఉన్న విద్యార్థులకు క్రీడా సామగ్రిని సమకూరుస్తానని తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం


సత్యశ్రీ రోడ్డు ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ రంగారావు

మండపేట: మన ఇంటితో పాటు చుట్టూ ఉన్న పరిసరాలు బాగుంటేనే అందరి ఆరోగ్యాలు బాగుంటాయని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు అన్నారు. ప్రజలందరికీ ఆరోగ్యకర వాతావరణం అందించాలనే ధ్యేయంతో పట్టణ పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. గురువారం ఆయన ఆర్పీలు, శానిటేషన్ విభాగం సిబ్బందితో కలిసి పట్టణంలోని మెయిన్‌రోడ్డు, సత్యశ్రీ రోడ్డు వీధుల్లో పర్యటించారు. వీధులను పరిశీలించి పరిసరాలు పరిశుభ్రత పాటించాలని చెప్పారు. ఆయన వెంట ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, మెప్మా ఆర్పీలు, సచివాలయ సిబ్బంది వున్నారు.

కన్నబాబు నియామకంపై హర్షం


వెంకన్నబాబు

మండపేట: వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్‌గా మాజీ మంత్రి కురసాల కన్నబాబు నియామకంపై ఆ పార్టీ నాయకుడు యరమాటి వెంకన్నబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కన్నబాబుకు ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్‌గా మూడు జిల్లాలకు ఉన్నతమైన పదవి లభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఉత్తరాంధ్రలో పార్టీని గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పటిష్టం చేయగల సత్తా ఉందని, ప్రజా పాత్రికేయుడిగా కన్నబాబు ఉత్తరాంధ్రలో విశేషమైన సేవలు అందించారన్నారు. ఆ అనుభవాలు పురస్కరించుకుని ఉత్తరాంధ్రలో పార్టీ తిరిగి యథా స్థానానికి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

సరోజనీ నాయుడుకు ఘన నివాళి


సరోజనీ నాయుడు చరిత్రను టీవీలో వీక్షిస్తున్న చిన్నారులు

మండపేట: స్వాతంత్ర్య సమరయోధురాలు సరోజనీ నాయుడు జయంతిని 30వ వార్డు ఎంపీపీ పాఠశాలలో గురువారం నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయుడు చిట్టూరి శ్రీధర్ స్కూల్లోని టీవీపై భరతమాత ముద్దుబిడ్డ గొప్ప తనాన్ని ప్రదర్శించి ఆమె జీవితగాథను చిన్నారులకు తెలియజేశారు. చిన్నారులు ఆమె చిత్రపటం వద్ద పూలు ఉంచి నివాళులర్పించారు. ఆమె మహిళల హక్కులు, సమాజంలో ప్రతీ ఒక్కరికీ సమానత్వంపై పోరాటం చేశారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి తొలి జాతీయ అధ్యక్షురాలిగా, తొలి మహిళా గవర్నర్‌గా పని చేశారని చెప్పారు. చిన్నారి సరోజనీ వేషధారణలో అలంరించారు.

వైభవంగా పేరంటాలమ్మ జాతర

రాయవరం: పసలపూడిలో శ్రీపేరంటాలమ్మ అమ్మవారి జాతర గురువారం ఘనంగా నిర్వహించారు. కర్రి వంశీకుల ఆడపడుచుగా పేరుగాంచిన అమ్మవారికి ఏటా జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. జాతరలో భాగంగా ప్రతి ఇంటి నుంచి కావెళ్లలో అమ్మవారికి చలివిడి, పానకం, చీర, సారెతో గ్రామంలో ఊరేగించారు. అందులో భాగంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీపై ఊరేగించి, గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. గ్రామానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రాయవరం, వెంటూరు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. ఈ విషయాన్ని రామచంద్రపురం ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు గురువారం విలేకరులకు తెలిపారు. వెంటూరు సబ్‌స్టేషన్ పరిధిలో మెయింటెనెన్స్ పనులు, రాయవరం సబ్‌స్టేషన్ పరిధిలో రాయవరం గ్రామానికి కొత్తలైన్ ఏర్పాటు చేస్తున్నందున విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.